ప్రజాశక్తి

సోమవారం 5 ఆగస్టు 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



రైల్వే స్టేషన్‌లో దగ్ధమవుతున్న కోర్బా ఎక్స్‌ప్రెస్ బోగీలు

విశాఖ రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదం

▶ వార్త మెయిన్‌లో..



బీచ్ రోడ్డులో శారీ వాక్

వార్త మెయిన్‌లో

బీచ్ రోడ్డు శారీ వాక్‌లో పాల్గొన్న హోం మంత్రి అనిత

'సిట్'పై దాగుడు మూతలేనా?

భూ ఆక్రమణలపై రెండు నివేదికలూ బుట్టదాఖలేనా?



సిట్ నివేదికను అందజేస్తున్న వినీత్‌బ్రిజ్‌లాల్ (ఫైల్)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ అంటేనే ప్రభుత్వ భూముల దురాక్రమణ'దారు'లకు అడ్డా.. అన్న నానుడి స్థిరపడిపోయింది. బయట ప్రాంతాల నుంచి విశాఖకు బతుకు తెరువు కోసం వచ్చిన కొంతమంది పెద్దలు ఇక్కడ తీరప్రాంతం, గ్రామీణం, గిరిజన ప్రాంతాలన్నింటా సెటిల్ అయి, ప్రభుత్వ భూములను కాజేయడం 1970-80వ దశకం నుంచీ మొదలైంది. రూ.వందల కోట్ల విలువైన వేల ఎకరాలు పెద్దల ఆక్రమణలో మూలుగుతున్నాయి. విశాఖ నగరంలోనూ విలువైన భూములను ఇలాగే తమ గుప్పెట పెట్టుకుని ప్రభుత్వాల కళ్లు కప్పుతూ కళ్లముందే తిరుగుతున్నారు. 1990వ దశకం తర్వాత వీరిలో కొంతమంది రాజకీయాల్లో క్రియాశీలకంగా మారడంతో తమ భూముల బాగోతం ఇంకా వర్ధిల్లుతోంది. టిడిపి హయాంలో వైసిపి, వైసిపి హయాంలో టిడిపి సిట్ నివేదికలపై కంఠశోష పెట్టడం తప్ప ఏ ప్రభుత్వానికీ ఈ నివేదికలు బయటపెట్టి దోషులపై చర్యలు తీసుకున్న దాఖలా లేదు. జిల్లాలో వామపక్షాలు ప్రధానంగా సిపిఎం ఈ సిట్ నివేదికలను ప్రభుత్వం బయటపెట్టి దురాక్రమణదారులు ఎంతటి వారైనా కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలంటూ తొలినుంచీ డిమాండ్ చేస్తోంది.

అందుగలడు ఇందులేడని సందేహం వలదన్నట్టుగా...

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రముఖ రాజకీయ ప్రధాన పార్టీల (వైసిపి, టిడిపి)కు చెందిన వారే సుమారు 25 మంది వరకూ ఉంటారన్నది 2017లో చంద్రబాబు హయాంలో భూముల ఆక్రమణలపై వేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), 2019లో జగన్ హయాంలో వేసిన సిట్ పట్టిచూపుతున్నాయి. అయితే చర్యలు తీసుకోవడంలో ఇరు పార్టీలూ దొందూ దొందే.. 2024లో టిడిపి కూటమి రాష్ట్రంలో అధికారానికి రావడంతో ఇప్పుడైనా ఈ తీగ లాగుతారా? అంటే వేచిచూడాల్సిందే.

వేల ఎకరాలపై వేసిన 2 సిట్ నివేదికలూ బుట్టదాఖలే...

గత చంద్రబాబు హయాంలో కూడా 2017లో ఐపిఎస్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటుచేశారు. ప్రభుత్వ రికార్డులను పరిశీలించి పలు అక్రమాలను ఆ బృందం గుర్తించింది. మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమర యోధులు, రాజకీయ బాధితుల కోసం నగర పరిసరాల్లో కేటాయించిన భూములు చేతులు మారాయని

మిగతా 2లో..

సూక్ష్మ సేద్యంపై ప్రభుత్వం దృష్టి

- పంట దిగుబడి, ఖర్చు తగ్గించడమే లక్ష్యం
- జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జివి లక్ష్మి





ప్రజాశక్తి-అనకాపల్లి

భూగర్భ జలాలు నానాటికి అడుగంటుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ సేద్యంపై దృష్టి సారించిందని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జివి లక్ష్మి తెలిపారు. నాణ్యమైన పంట దిగుబడి, ఖర్చు తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. సూక్ష్మ సేద్యం విధానంపై ఆమెను కలిసిన 'ప్రజాశక్తి'తో పంచుకున్న వివరాలు ఆమె మాటల్లోనే...

సూక్ష్మ సేద్యం ప్రాధాన్యతను వివరించండి.....

రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ సేద్యంపై దృష్టి సారించడం ద్వారా నాణ్యమైన పంట దిగుబడి, సాగు ఖర్చు తగ్గించడమే లక్ష్యం. నీరు, కరెంటు, ఎరువులు, కూలీల ఖర్చు ఆదా అవుతుంది.

ఎంత విస్తీర్ణంలో చేపడుతున్నారు?

రాష్ట్రంలో మూడు లక్షల హెక్టార్లలో, మన అనకాపల్లి జిల్లాలో 2024-25 సంవత్సరానికి 3600 హెక్టార్లలో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సూక్ష్మ సేద్యం అమలు చేసేందుకు విద్యుత్తు, నీరు తప్పనిసరిగా ఉండాలి.

ఇందుకోసం ఎంత ఖర్చు చేస్తున్నారు?

కేంద్ర ప్రభుత్వం

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

'సిట్'పై దాగుడు మూతలేనా?

తేల్చింది. 2018లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. సుమారు 3000 వరకూ దరఖాస్తులు టిడిపి హయాంలో భూ కుంభకోణాలపై వచ్చినా చర్యల్లేవు.

వైసిపి హయాంలోనూ ఇదే తంతు...

వైసిపి హయాంలో 2019 అక్టోబర్, నవంబర్‌లో సిట్ విచారణ జరిపింది. మాజీ బ్యూరోక్రాట్‌లు విజయ్‌కుమార్, వైవి అనురాధ, మాజీ జిల్లా సెషన్స్ జడ్జి టి.భాస్కరరావు నేతృత్వంలో ఈ పరిశీలన చేసింది. 2020 ఫిబ్రవరిలో వైసిపి హయాంలో మొదటి మధ్యంతర నివేదిక అందింది. వీరి హయాంలో దాదాపు 2200 వరకూ భూ ఫిర్యాదులు వచ్చాయి. 2021లో ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో సెప్టెంబర్‌లో నివేదిక సమర్పించారు. రికార్డుల ట్యాంపరింగ్, ప్రభుత్వ భూములను ఆక్రమించడం, ప్రభుత్వ భూమిని లాక్కోవడం, ప్రభుత్వ భూమిని ప్రయివేటు వ్యక్తులకు, సంస్థలకు కేటాయించడం, రాజకీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోదులకు ఎన్‌ఒసిలు జారీచేయడం వంటి 6 రకాలుగా భూములను వర్గీకరించారు. వైసిపి హయాంలో సిట్‌కు 1400 దరఖాస్తులు వచ్చాయని కొన్నిటినీ దాచేసి చెప్పడం జరిగింది. వీటిలో ఎక్కువ భాగం 22-ఎ భూములకు సంబంధించినవి. పరిశీలన చేసిన అనంతరం సుమారు 400 క్లియర్ చేశారు. మిగతావన్నీ రెవెన్యూ తగాదాల్లోనే మూలుగుతున్నాయి. ఆ తర్వాత కోవిడ్ రావడంతో 2020 జూన్ తర్వాత సిట్ కార్యకలాపాలు ఆగిపోయాయి. 2021 జనవరి నెలాఖరున మధ్యంతర నివేదిక ఇచ్చింది. ల్యాండ్ స్కాం విశాఖ గ్రామీణ ప్రాంతం భీమిలి, అనకాపల్లి, పరవాడ, అచ్యుతాపురం, సబ్బవరం సహా మరికొన్ని మండలాల్లో వివిధ రకాల ప్రభుత్వ భూములకు సంబంధించి దాదాపు 3వేల ఎకరాల భూములు ఆక్రమణకు గురైనట్లు పేర్కొన్నారు. 300 మంది వ్యక్తుల చేతుల్లో ఇవి ఉన్నట్లు తేల్చారు. దీనిపైనా వైసిపి హయాంలో చర్యల్లేవు.

ఉమ్మడి జిల్లాలో భూ ఆక్రమణలపై మీనమేషాలు...

విశాఖ ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో నిర్ధిష్టంగా కొన్నిటిని యంత్రాంగం గుర్తించింది. పరవాడ, భీమిలి, గాజువాక, పెందుర్తి, ఎస్.రాయవరం, సబ్బవరం, యలమంచిలి, పాయకరావుపేట మండలాల్లో ప్రధానంగా ఆక్రమణకు గురయ్యాయి. బుచ్చయ్యపేటలో 379.99 ఎకరాల ప్రభుత్వ భూమికి గానూ 194.61 ఎకరాలను మింగేసినట్లు భోగట్టా. భీమన్నదొరపాలెంలో 124.14 ఎకరాలు, రాంబిల్లిలో 108.61 ఎకరాల ప్రభుత్వ భూమి, 26.19 ఎకరాల దేవాదాయ శాఖ భూమి కూడా అక్రమార్కుల చెరలో బందీ అయినట్లు సిట్ పేర్కొంది. దేవరాపల్లిలో 83.61 ఎకరాలు, సబ్బవరంలో 71.73, చుక్కపల్లిలో 69.01, ఆనందపురంలో 62, గోపాలపట్నంలో 33.45 ఎకరాలు, విశాఖపట్నం గ్రామీణంలో 27.39 ఎకరాల ప్రభుత్వ భూమి పరాధీనమైనట్లు గుర్తించారు. విశాఖ చుట్టుపక్కల భూములను హస్తగతం చేసుకునే క్రమంలో వాటి వర్గీకరణకు సంబంధించి రికార్డుల్లో అనేక మార్పులు చేశారు. పలు ప్రభుత్వ భూములను జిరాయితీ భూములుగా విస్తీర్ణం పెంచి చూపించారు. అసైన్‌మెంట్ భూములకు సంబంధించి అసలు పట్టాదారు స్థానంలో కొత్త పేర్లు పుట్టుకొచ్చాయి. కొన్ని కేసుల్లో ఇంటిపేర్లు మారిపోయాయి. ఇలాంటి సుమారు 3500 ఎకరాలు విశాఖ చుట్టుపక్కలా ఉన్నాయి.

సూక్ష్మ సేద్యంపై ప్రభుత్వం దృష్టి

పిఎంకెఎస్‌వై పథకం కింద రూ.9.72 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం ఎపిఎంఐపి పథకం కింద రూ.6.48 కోట్లు వెరసి 60: 40 నిష్పత్తిలో మొత్తం రూ.17.45 కోట్లు వ్యవసాయ, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఖర్చు చేస్తున్నారు.

ఎటువంటి రైతులను లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారు?

బిందు సేద్యంలో ఐదు ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతులకు 90 శాతం రాయితీ, ఐదు ఎకరాల నుంచి 12.50 ఎకరాల వరకు ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై ఎంపిక చేయడం జరుగుతుంది. తుంపర సేద్యంలో ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతులకు 55 శాతం, ఐదు ఎకరాల పైబడ్డ రైతులకు 45 శాతం రాయితీ అందిస్తాం.

ఈ పథకం కింద దరఖాస్తు ఎలా చేయాలి?

సూక్ష్మ సేద్యం రాయితీ నిమిత్తం రైతు రిజిస్ట్రేషన్ సేవా కేంద్రంలో విఎఎ, విహెచ్‌ఎ, ఎంఐఎఒ లేదా ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలి. భూమి హక్కు పత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఎఫ్‌ఎంబి భూమి సరిహద్దులు, నీటి వనరులు (బోర్ వెల్/ బావి/ కాలువ) వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రాధాన్యత క్రమంలో అనుమతులు ఇస్తాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

సెప్టెంబర్ 6 వరకు పిజిఆర్‌ఎస్ ఉండదు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో సెప్టెంబర్ 6 వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమం ఉండబోదని విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ తెలిపారు. ఉప ఎన్నిక నిర్వాహణ కోసం ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించినందున జులై 30నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జివిఎంసి ప్రధాన కార్యాలయం, అన్ని జోనల్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కూడా సెప్టెంబర్ 6వ తేదీ వరకు ఉండదని జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు.

హార్బర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ



హార్బర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన నగర పోలీస్ కమిషనర్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలోని హార్బర్ పోలీస్ స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్జీ ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. అప్పటికే పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడుతూ, స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరును స్వయంగా ఆరాతీశారు. వారి సమస్యలను తెలుసుకొని పోలీస్ స్టేషన్ నుంచి పరిష్కరిస్తున్న తీరునూ పరిశీలించారు. అనంతరం స్టేషన్ మొత్తం నిశితంగా పరిశీలించిన ఆయన స్టేషన్ ఆనుకొని ఉన్న ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా, శుభ్రం చేయించి, మొక్కలు నాటాలని ఆదేశించారు. స్టేషన్‌లో ఎల్లవేళలా తగు సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు తక్షణం పరిష్కరించాలన్నారు. అన్ని రిజిస్టర్లు అప్‌డేట్‌గా ఉండాలని ఆదేశించారు.

సిబ్బందితో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది చెప్పిన సమస్యల్లో కొన్నింటిని తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సిబ్బందికి కుటుంబపరంగా, ఉద్యోగం పరంగా, ఇతర ఏ సమస్యలు ఉన్నా 7995095799 నెంబరుకు తెలియచేయాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు మర్యాద ఇస్తూ కూర్చోబెట్టి సమస్యలను వినాలని, వాటిని పారదర్శకముగా విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. క్రైమ్ పోలీస్ స్టేషన్ అవరణలో సీజ్ చేయబడిన, వినియోగంలో లేని వాహనాలను పాడవకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

పోర్టు పరిసరప్రాంతాలు ఎక్కువగా ఉన్న స్టేషన్ పరిధిలో దొంగతనాలు, అసాంఘిక చర్యలూ జరగకుండా క్రైమ్ పోలీసులు పోలీసింగ్ చేయాలని, సిసి టీవీ కెమెరాలు మరిన్ని వినియోగించుకునేటా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలను గమనించాలన్నారు. విధుల్లో ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యాచకుడిని ఆసుపత్రికి తరలించిన సీపీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రోడ్డు డివైడర్‌పై ప్రమాదకర స్థితిలో ఉన్న యాచకుడిని కాపాడి కారులో ఆసుపత్రికి తరలించి తన మానవతను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చాటుకున్నారు. కమిషనరేట్ పరిధిలో పోలీసింగ్‌ను తనిఖీ చేస్తూ రైల్వే స్టేషన్ సమీపంలో ఒక యాచకుడు ప్రమాదకర స్థితిలో రోడ్డు డివైడర్‌పై పడి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే తన వాహనం ఆపి సదరు యాచకుడును ఎస్కార్ట్ వాహనంలో కెజిహెచ్‌కు తీసుకెళ్లి వైద్యులతో మాట్లాడి అవసరమైన చికిత్స అందజేశారు.

అబ్బురపరిచిన సత్య హరిశ్చంద్ర

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ 20వ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం మద్దిలపాలెం కళాభారతిలో సత్య హరిశ్చంద్ర, శ్రీ రామాంజనేయ యుద్ధం నాటకాల్లోని సన్నివేశాలను ప్రదర్శించారు. సత్యహరిశ్చంద్ర నాటకంలోని అమ్మకం (బత్తిమలేఖ) సన్నివేశంలో హరిశ్చంద్రుడిగా తలాడ నర్సినాయుడు, నక్షత్రకుడు తిరునగరి శ్రీనివాసరావు, అద్భుతంగా నటించారు. వీరబాహుడుపాత్రలో నంది అవార్డు గ్రహీత వంకాయల మారుతీ ప్రసాద్ పరకాయ ప్రవేశం చేసి ప్రేక్షకులను అలరించారు. కాటి సన్నివేశాన్ని ఎంఎస్. నాయుడు, గౌరీశ్వరి అద్భుతంగా ప్రదర్శించారు.

విజయనగరానికి చెందిన కందుల గుణేశ్వరరావు, ఏలూరి పైడిరాజు శ్రీ రామాంజనేయ యుద్ధం సన్నివేశాన్ని, బొంత లక్ష్మణరావు మురళీధర్, బుర్తనపల్లి కృష్ణ, ఆర్‌టిసి లచ్చయ్య, బలరాం సహకారంతో చెన్నారెడ్డి రైతు యాతలం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కళాకారులను మాజీ ఆర్మీ డైరెక్టర్ జెవై.డిఫెన్స్ అకాడమీ అధినేత జగన్నాథమోహన్ రావు, ప్రముఖ విద్యావేత్త అంజనప్ప ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమం లో ప్రముఖ చలనచిత్ర నటులు, దర్శకులు, నిర్మాత ఐనవోలు ప్రసన్న కుమార్, లీడర్ పత్రికా సంపాదకులు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి , విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత సూరప్పనేని విజయ్ కుమార్, పైడా కళాశాలల అధినేత పైడా కృష్ణప్రసాద్, ప్రజా నాట్య మండలి విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు దండు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ సొత్తు రికవరీ మేళా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో జులై నెల రికవరీ మేళాను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, జులై నెలలో 97 నేరాల్లో రూ.59,24,906 విలువ గల సొత్తు చోరీ అయిందని తెలిపారు. వాటిలో 72 కేసులను ఛేదించి 108 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వారిలో 16 మంది మైనర్లు ఉన్నారని తెలిపారు. చోరీ కాపాడిన సొత్తులో రూ.47,63,690 విలువగల వస్తువులను రికవరీ చేసినట్లు వివరించారు. రికవరీ చేసిన వస్తువులను రికవరీ మేళా ద్వారా బాధితులకు అందజేస్తున్నట్లు తెలిపారు. జులై నెలలో ఛేదించిన 72 కేసులలో 54 కేసులు జులై నెలలోనే నమోదైనవని, మిగిలినవి గతంలో నమోదైన కేసులుగా ఆయన తెలిపారు. జులై నెలలో రికవరీ చేసుకున్న సొత్తులో 887.09 గ్రాముల బంగారం, 5320 గ్రాముల వెండి, రూ.13,30,050 నగదు, 16 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, రెండు కంప్యూటర్లు, మూడు యాంప్లిఫయర్లు, 100 మీటర్ల కాపరువైర్, ఒక రిఫ్రిజిరేటర్ ఉన్నాయని వివరించారు. నగరంవ్యాప్తంగా 355 సీసీ కెమెరాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. 168 క్రైమ్ అవేర్‌నెస్ క్యాంపులు నిర్వహించామని చెప్పారు. రాత్రి వేళలో గస్తీ నిర్వహణను మరింత పటిష్టం చేశామని, జులై నెలలో రూ.37.80 లక్షల విలువైన 252 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామని తెలిపారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే చాట్ బాట్ ద్వారా 9490617916 నెంబర్ ‌ు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ మీడియా సమావేశంలో జాయింట్ కమిషనర్ కె.ఫకీరప్ప, డిసిపి పి.వెంకటరత్నం, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వాస్క్యులర్ సొసైటీ వాక్‌థాన్



వాక్‌థాన్‌లో పాల్గొన్న సిపి శంకబ్రత బాగ్చీ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : జాతీయ వాస్క్యులర్ డే సందర్భంగా అవయవ తొలగింపు నివారణ, రక్త నాళల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించటం కోసం వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా (విఎస్ఐ) ఆధ్వర్యాన ఆదివారం ఉదయం వాక్‌థాన్‌ను నిర్వహించారు. పామ్ బీచ్ హోటల్ నుంచి కాళీ మాత ఆలయం వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాక్‌థాన్‌లో 500 మందికి పైగా నగరవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అవయవ తొలగింపును నివారించాల్సిన ఆవశ్యకత దాని వల్ల కలిగే ప్రభావంపై సిపి మాట్లాడారు. అనంతరం వాస్కులర్, ఎండోవాస్కులర్ సర్జన్ డాక్టర్ దివాకర్ బెండి మాట్లాడుతూ తమ సంస్థను వ్యాధుల గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రమాదాల్లో అంగవైకల్యం పొందిన వారు మూడేళ్లలోపు మరో అవయవాన్ని కోల్పోవడం జరుగుతుందని, ఐదేళ్లలో 50 శాతం మరణాల సంభవిస్తున్నాయని వివరించారు. తమ సొసైటీ ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించడంలో అవయవ తొలగింపు రహిత ప్రపంచం కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పిసి.గుప్తా, డాక్టర్ తపిష్ సాహు, మాట్లాడుతూ, తాము నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా 30 మహా నగరాల్లో జాతీయస్థాయిలో ఈ వాకథాన్ నిర్వహిస్తున్నామని, సుమారు 15 వేల మంది అన్ని ప్రాంతాల్లో కలుపుకొని ఈ వాకథాన్ పాల్గొంటున్నారని తెలిపారు.

వంగపండు సాహిత్యం గొప్పది

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : వంగపండు ప్రసాదరావు సాహిత్యం చాలా గొప్పదని, ఉత్తరాంధ్ర మాండలికాన్ని దేశవ్యాప్తంగా చాటి చెప్పారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి కొనియాడారు. ఆదివారం వంగపండు వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వంగపండు శిష్యుడు మజ్జి దేవిశ్రీ వంగపండును ఉద్దేశించి పాటలు పాడుతూ వంగపండు రాసిన పాటలను గుర్తు చేశారు.

ప్రముఖ కవి నాటకకర్త ఎన్ఎన్‌ఆర్ మాట్లాడుతూ, వంగపండు శిష్యుడుగా ఉండడం తన అదృష్టం అన్నారు. చలసాని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, వంగపండు షిప్‌యార్డ్‌లో పని చేస్తున్నప్పుడు ఆయనతో కలిసిపనిచేశానని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు, గాయకులు మస్తాన్ రెడ్డి, వర్రి నాంచారయ్య, ప్రముఖ సినీ దర్శకులు భాష, మూడెడ్ల శ్రీనివాస్, చంటి తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన రోడ్డులో రాకపోకలకు ఇక్కట్లు

- పైపులైన్ గోతులతో కొండపేట రోడ్డు అధ్వానం
- అరకొరగా పూడ్చి వదిలేయడంతో అవస్థలు
- ప్రజల కష్టాలు పట్టించుకోని అధికారులు



గతుకులమయమై రాళ్లు తేలినకొండపేట రోడ్డు

ప్రజాశక్తి -తగరపువలస : తాగునీటి పైపులైన్ కోసం రోడ్డు వెంబడి తీసిన గోతులను అరకొరగా పూడ్చి వదిలేయడంతో రాకపోకలకు పాదచారులు, వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. తీసిన గోతులను పైపైనే మట్టితోనే పూడ్చి, తర్వాత శాశ్వతంగా పటిష్టపరిచే చర్యలు చేపట్టకపోవడంతో నిండా గోతులమయమై, వర్షం కురిస్తే బురదకు నెలవుగా మారి ఇబ్బందులకు గురిచేస్తోంది. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.
కొద్ది నెలల క్రితం స్థానిక జంక్షన్‌ను ఆనుకుని జివిఎంసి ఒకటో వార్డు కొండపేట నుంచి పంప్‌హౌస్ వరకు గత ప్రభుత్వ హయాంలో తాగునీటి సరఫరాకు పైపులైన్ వేశారు. పాతపైపులైన్ లీకేజీ, పాడవ్వడంతో తరచూ తాగునీటికి పడుతున్న ఇక్కట్లు నుంచి విముక్తికి కొత్త పైపులైన్ ఏర్పాటు చేశారు. రోడ్డు వెంబడి గోతులు తవ్వి కొత్త పైపులైన్ ఏర్పాటుతో ప్రజల తాగునీటి కష్టాలు కొంతమేర తీరినా, ఈ సందర్భంగా తీసిన గోతులను పూడ్చి, పటిష్టం చేయడంతోపాటు శాశ్వత రోడ్డు వేయకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు కొత్త కష్టాలు మొదలయ్యాయి.
కొండపేట నుంచి రోడ్డుకు ఒకవైపున పైపులైన్ ఏర్పాటుకు తవ్విన గోతులను తాత్కాలికంగా అదే మట్టితో పూడ్చి వదిలేశారు. తర్వాత దాన్ని పట్టించుకోకపోవడంతో పైపులైన్‌లో పూడ్చిన మట్టికాస్తా కుంగి గోతులు ఏర్పడడంతోపాటు ఎక్కడికక్కడే రాళ్లు తేలి గోతులమయం కావడంతో రోడ్డు మార్గాన రాకపోకలు సాగించే పాదచారులతోపాటు కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడే పరిస్థితి ఉంది.
శాశ్వతంగా రోడ్డు మరమ్మతులు చేయక పోవడంతో. వర్షం కురిస్తే గోతుల్లో నీరు.చేరుతుంది. దీంతో రోడ్డు వెంబడి ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడడంతోపాటు, కార్లు, బైక్‌లు, ఆటోలు ప్రయాణించే సందర్భంలో గోతుల్లో దిగడంతో అందులోని నీరు పాదచారులపై ఎదచల్లబడడంతో ఇక్కట్లు పడడమే కాకుండా, కొన్ని సందర్భాల్లో వివాదాలకు కారణమయ్యాయి. అంతేకాక రాళ్లు తేలిన రోడ్డులో ప్రయాణంతో వాహనాల టైర్లు పంక్చర్‌తోపాటు పాడైన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పైపులైన్ కాంట్రాక్టర్ స్పందించి, కొండపేట మార్గంలో పైపులైన్ ఏర్పాటుతో అధ్వానంగా మారిన రోడ్డుకు శాశ్వత మరమ్మతులతోపాటు పునర్నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వేసిన నుంచి చుక్క నీరొస్తే ఒట్టు!

- అధికారుల నిర్లక్ష్యంతో వేలల్లో ప్రజాధనం వృథా
- నేతల మెప్పు కోసం బోరు వేసి వదిలేశారంటున్న జనం



ఏర్పాటే తప్ప పనిచేయని బంటాకాలనీలోని మంచినీటి బోరు

ప్రజాశక్తి-పెందుర్తి : చిత్తశుద్ధి, బాధ్యత లేని పనుల వల్ల ప్రజాధనం వృథాయే తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదనడానికి బంటాకాలనీ వద్ద ఏర్పాటు చేసిన తాగునీటి బోరు నిదర్శనమని స్థానికులు మండిపడ్డారు.
ప్రజలు విజ్ఞప్తికి స్పందించి, ప్రజాప్రతినిధులు సిఫార్స్‌చేస్తే, అయిందనిపించుకోవడానికే అన్నట్లు అధికారులు ఏర్పాటు చేసిన ఈ బోరు నుంచి వేసిన నుంచి నేటి వరకు చుక్క నీరు వస్తే ఒట్టని స్థానికులు అంటున్నారు. సరికదా.. నిర్లక్ష్యం వదిలేయడం వల్ల వినియోగానికి ముందే ఇది తుప్పు పట్టి పాడౌతోందని ఆవేదన చెందుతున్నారు.
జివిఎంసి 92 వ వార్డు, బంటా కాలనీ అంగన్వాడీ కేంద్రం దగ్గర కొండపై రెండేళ్ల క్రితం మంచినీటి బోరును ఏర్పాటు చేశారు. అప్పట్లో స్థానిక కార్పొరేటర్‌కు అధికార వైసిపికి చెందిన నేతలు చెప్పడంతో, ఆయన సూచనల మేరకు ఆదరాబాదరగా బోరును ఏర్పాటు చేసేశారు. బోరు పాయింట్ తవ్వి, హెడ్‌బిగించి తమ పని అయిపోయిందన్నట్లు అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో నాటి నుంచి నేటి వరకు ఇది వినియోగంలోకి రాని పరిస్థితి ఉంది.
రెండేళ్లుగా వదిలేయడంతో బోరు బయట తుప్పు పట్టి పాడౌతుండగా, లోపల పరిస్థితి ఏంటో తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా నాయకుల మెప్పు కోసం కాకుండా, ప్రజలకు ప్రయోజనకరంగా ఉండేలా అధికారులు పనిచేయాలని, అలా చేస్తే ఇలాంటి బోర్లు ఏర్పాటుతో ప్రజాధనం వృథా కాదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తక్షణమే ఈ బోరును వినియోగంలోకి తెచ్చే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గంభీరం రిజర్వాయర్‌లో మునిగి

గీతం విద్యార్థి దుర్మరణం

- మృతుడు శ్రీకాకుళం జిల్లా పలాస వాసి
- స్నేహితుల దినోత్సవం రోజున
- విహారానికి వెళ్లిన విద్యార్థుల్లో విషాదం



సిపిఆర్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది, నిరంజన్ మృతదేహం

ప్రజాశక్తి-ఆనందపురం: స్నేహితుల దినోత్సవం రోజున సరదాగా విహారానికి వెళ్లిన గీతం వర్సిటీ బిటెక్ విద్యార్థి గంభీరం రిజర్వాయర్‌లో మునిగి మృతి చెందడంతో విషాదం నెలకొంది. వివరాలివి
గీతం విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థుల బృందం ఆదివారం సాయంత్రం గంభీరం రిజర్వాయర్ చూసేందుకు వచ్చారు. వీరిలో డోకి నిరంజన్, ఆశిష్, ఆహిల్ ప్రిన్స్, జాన్ యోషిత్, రెహానా, లలిత్‌లతో కూడిన విద్యార్థుల బృందం వేరేగా రిజర్వాయర్ వద్ద నీటిమట్టాన్ని కొలిచేందుకు ఏర్పాటు చేసిన వంతెన వద్దకు వెళ్లారు. అక్కడ నుంచి స్నేహితులంతా ఆనందంగా రిజర్వాయర్ అందాలను చూస్తున్న సమయంలో డోకి నిరంజన్ అనే విద్యార్థి కాలుజారి రిజర్వాయర్‌లో పడ్డాడు. అతనిని రక్షించడానికి ఆశిష్ అనే విద్యార్థి నీటిలో దూకే క్రమంలో వంతెనకు తగలడంతో అతను గాయపడ్డారు. ఇద్దరు విద్యార్థులు నీటిలో పడి మునిగిపోతుండగా, ఆహిల్ ప్రిన్స్ అనే మరో విద్యార్థి నీటిలో ధైర్యంగా నీటిలో దూకి ఆశీష్‌ను కాపాడి ఒడ్డుకు చేర్చాడు. అయితే ముందుగా నీటిలో పడిపోయిన నిరంజన్ చేతికి చిక్కక నీటిలో మునిగిపోయాడు.
స్నేహితుల సమాచారం మేరకు సిఐ టివి.తిరుపతిరావు, ఎస్ఐ గంట్యాడ సంతోష్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతోపాటు ఫైర్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని గల్లంతైన విద్యార్థి నిరంజన్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్‌లో నీటిమట్టం ఎక్కువగా ఉండడం, సాయంత్రం కావడంతో నీటిలోపలికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టేందుకు సిబ్బంది వెనకడుగు వేసే పరిస్థితుల్లో సిఐ తిరుపతిరావు స్వయంగా నీటిలో దిగేందుకు సిద్ధపడడంతో, అగ్నిమాపక సిబ్బంది కలమటి చక్రవర్తి, గంజారి శ్రీను రిజర్వాయర్‌లో దూకి, 20 అడుగుల లోతులో ఉన్న నిరంజన్ మృతదేహాన్ని సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో గుర్తించి బయటకు తీశారు. నిరంజన్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన ఆశీష్‌ను చికిత్స కోసం ఆనందపురం పిహెచ్‌సికి తరలించారు. విద్యార్థి మృతితో గీతంలో విషాదఛాయలు అలుముకున్నారు. విహారానికి వచ్చిన విద్యార్థులంతా స్నేహితుడి మృతితో విషాదంలో మునిగిపోయారు.
కాగా గీతంలో బిటెక్ మూడో సంవత్సరం చదువుతున్న మృతుడు డోకి నిరంజన్‌ది శ్రీకాకుళం జిల్లా పలాస కాగా, అతని తండ్రి శ్రీనివాసరావు చిన్న వస్త్రదుకాణం వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. మృతుడు నిరంజన్ ఆ కుటుంబంలో ఏకైక కుమారుడని అంటున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేరాలు ఘోరాలు

ప్రేమ పేరుతో బాలికను వంచన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికపై అత్యాచారం ఘటనపై కేసు నమోదు చేసినట్లు సిఐ తిరుపతిరావు తెలిపారు వివరాలివి. మండలంలోని బోయపాలెం జిఎన్ ఆర్ కాలనీ చెందిన బాలికను కల్లివానిపాలెం గ్రామానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో వంచించి, అత్యాచారం చేశాడు. గర్భవతినని తెలిశాక ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

అల్యూమినియం దుకాణంలో చోరీ

- రూ.50వేల నగదు అపహరణ

ప్రజాశక్తి -గాజువాక: గాజువాక కణితి రోడ్డులోని సింహాద్రి అల్యూమినియం దుకాణంలో ఆదివారం చోరీ జరిగింది. షాపు షట్టర్‌ను కోసి, లోపలకు చొరబడిన దొంగలు, కౌంటర్‌లో ఉన్న రూ. 50 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఈమేరకు సిసి టివిలో దొంగతనానికి సంబంధించిన దృశ్యాలు నమోదయ్యాయి. ఘటనపై షాప్ యజమాని గాజువాక పోలీసులు ఫిర్యాదు చేశారు. క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు.సంఘటనాస్థలిని సందర్శించి, చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



శిల్పారామంలో ప్రదర్శిస్తున్న నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-మధురవాడ : శిల్పారామం జాతరలో ప్రతి ఆదివారం నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఈఆదివారం నిర్వహించిన ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. ఇందులోభాగంగా శ్రీలక్ష్మి నరసింపకళభారతి బొబ్బిలి వారిచే ప్రదర్శించిన కోలాటం, శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ప్రదర్శనలో భాగంగా ముందుగా సిద్ధి మా గణపతి, భజరంగ్' హనుమాన్, పచ్చ పచ్చ నీలవేణి, ఈ వేప చెట్టుకు ఉయ్యాల, అబ్బుజు దేవుడు అయోధ్య రాముడు, కనక దుర్గమ్మ కదలిరావా, గోకులకృష్ణ గోపాలకష్ణ, గళ్లుగళ్లు గజ్జలమాత, మూత గంగపిళ్లై గౌరమ్మ వంటి గీతాలకు తష్య, రక్షిత, మేఘన, లక్ష్మి చరిత, గ్రీష్మ, లిఖిత, అనీష్, కృష్ణనాని, సాయి విష్ణుప్రియ, రమ్య, తస్మై, నందిని, చరిష్మ, గీతాంజలి, కృష్ణవేణి, మహాలక్ష్మి మౌనిక, జాహ్నవి, హారిక, చిన్నకృష్ణ, అప్పలనాయుడు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను తన్మయుల్ని చేసి, ఆకట్టుకున్నాయి. ఈ వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాన్ని శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

చెత్తను తొలగించరూ..!



లలితానగర్‌లో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు లలితానగర్ తొండ వినాయకుడి గుడి రోడ్డులో చెత్త పేరుకుపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిరోజులుగా చెత్త నిల్వ ఉండడంతో దుర్గంధంతోపాటు దోమలకు ఆవాసంగా మారిందని, దీంతో వ్యాధులు ప్రబలుతాయేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జివిఎంసి పారిశుధ్య విభాగం వెంటనే స్పందించి, ఇక్కడ పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సహజ వనరుల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఫోరం అధ్యక్షుడు సుబ్బారావు

ప్రజాశక్తి- సీతమ్మధార: ప్రకృతిపరంగా సహజసిద్ధమైన వనరులకు, ఖనిజాలకు విశాఖ నెలవని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గ్రేటర్ విశాఖపట్నం సిటిజెన్ ఫోరం అధ్యక్షులు సుబ్బారావు అన్నారు. ఆదివారం పౌరగ్రంథాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విశాఖలోని, ప్రకృతి సిద్ధమైన సహజ వనరులు, ప్రజాసంపద యథేచ్ఛగా దోపిడి, అన్యాక్రాంతానికి గురౌతోందన్నారు. పర్యావసానంగా గాలి, నీరు, భూమితోపాటు భూగర్భజలాల ఇలా సర్వం కాలుష్య కారకమై ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేమి, ట్రాఫిక్ వంటి సమస్యలతో ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సహజ వనరుల సంరక్షణతోపాటు ప్రజా సమస్యల పరిష్కారం, కనీస సౌకర్యాల కల్పనపై తమ ఫోరం తరపున ప్రణాళికాబద్ధంగా కృషి చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలను భాగస్వామ్యం చేసి, ఆయా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు విశ్వనాథం, సాహన్, నాగేశ్వరరావు, కృష్ణమూర్తి, స్వామి నాయుడు పాల్గొన్నారు.

జంతర్‌మంతర్ ధర్నాకు తరలిన పెన్షనర్లు
- 6,7,8 తేదీల్లో ఢిల్లీలో ఆందోళన

ప్రజాశక్తి -తగరపువలస: తమ సమస్యలను పరిష్కరించాలనిడిమాండ్ చేస్తూ, ఇపిఎఫ్ 95 పెన్షనర్లు ఈ నెల 6,7,8 తేదీలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ధర్నాకు చిట్టివలస ప్రాంతం నుంచి పలువురు పింఛనుదారులు ఢిల్లీ తరలివెళ్లారు. పెన్షన్ పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి ఇపిఎఫ్ 95పెన్షనర్లు దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారని చిట్టివలస పింఛనుదారుల సంఘం సహాయ కార్యదర్శి దామోదర బాబాజీ తెలిపారు. ధర్నా ఆందోళనలో పాల్గొనేందుకు వీరంతా తరలివెళ్లారని తెలిపారు.

చిరస్మరణీయంగా శత వసంతాల వేడుక



సన్నాహక సమావేశంలో ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల శత వసంతాల వేడుకలను డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు వేడుకల నిర్వహణ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఆదివారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఇక్కడి పాఠశాలలో విద్యనభ్యసించి, ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్నతోద్యోగాలు, ఇతరత్రా వ్యాపకాల్లో స్థిరపడిన వారందరినీ వేడుకలకు ఆహ్వానించాలని ప్రతినిధుల సమావేశం తీర్మానించింది స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. మూడు రోజులపాటు శత వసంతాల వేడుకల చిరస్మరణీయంగా గుర్తుండిపోయేలా నిర్వహించాలని నిర్ణయించారు. వేడుకల నిర్వహణ అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా సమావేశంలోనే పలువురు విరాళాలు ప్రకటించారు. సమావేశంలో వేడుకల నిర్వహణ కమిటీ అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, సహాయ కార్యదర్శులు చౌదరి సత్యరాజు, టి భీమారావు, మీసాల మహీధర్, ఎం సత్యానందం, ఉపాధ్యక్షులు ఎంవి పార్వతీశం, మైలపల్లి.షణ్ముఖరావు, కోశాధికారి పూసర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు

ఏదీ వేట నిషేధ భృతి.!

- రూ 20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- పరిహారం కోసం మత్స్యకారుల ఎదురుచూపులు



చేపల వేటకు వలలు సిద్ధం చేసుకుంటున్న మత్స్య కారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : సముద్రంలో వేట నిషేధ సమయంలో దానిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన భృతి కోసం వారు ఎదురుచూస్తున్నారు. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేటను ప్రభుత్వం నిషేధిస్తుంది. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే కాలంలో వేట సాగిస్తే పునరుత్పత్తి దెబ్బ తింటుందనే ఉద్దేశ్యంతో ఆ సమయంలో చేపల వేట నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పర్యావరణ సమతుల్యత పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వాలు తీసుకున్న ఈ నిర్ణయంతో చేపల వేటపై ఆధార పడ్డ మత్యకారులు, అనుబంధ రంగాలకు చెందిన వారి ఉపాధికి గండి పడుతుంది.

పరిహారం కోసం ఎదురుచూపు

వేట విరామ సమయంలో ఏటా అందించే ప్రభుత్వ పరిహారం కోసం మత్యకారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో మత్స్యకార భరోసా పేరుతో వేట నిషేధభృతి కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు భృతి కింద రూ.10 వేలు ఇచ్చారు. ఈ ఏడాది మేలో ఎన్నికలు జరిగాయి. జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం కారణంగా వేట విరామ సమయంలో మత్యకారులకు ఇచ్చే భృతి చెల్లింపులో జాప్యం వల్ల వీరు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు వేట విరామ సమయంలో రూ 20 వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో దాన్ని అమలు చేయాలని మత్యకారులు కోరుతున్నారు.

2,307 మంది లబ్ధిదారుల గుర్తింపు..

భీమిలి మండలం, పట్టణ పరిధిలో చేపల వేట నిషేధభృతి కింద 2,307 మంది మత్యకారులను లబ్దిదారులుగా మత్య శాఖ అధికారులు ఈ పాటికే గుర్తించారు. వారికి పరిహారం ఇవ్వటమే తరువాయి.
మండలంలో అటు అన్నవరం మొదలు ఇటు జివిఎంసి నాలుగో వార్డు మంగమారిపేట వరకు సుమారు 18 కిలోమీటర్ల తీర ప్రాంతంతో చేపల వేటే జీవనాధారంగా ఆయా మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. 480 సాంప్రదాయ, మోటారు బోట్లుతో వీరు చేపల వేట సాగిస్తున్నారు.

తక్షణమే భృతి చెల్లించాలి



చేపలవేట విరామం సమయంలో ఇస్తామన్న భృతి చెల్లించాలి. నిషేధం అనంతరం వర్షాలు ముంచెత్తడంతో చేపల వేటకు వెళ్లే పరిస్థితి లేక కుటుంబ పోషణ కష్టమౌతోంది. పరిహారమిచ్చి ఆదుకోవాలి

ఉమ్మడి మసేను, మత్యకారుడు
ఎగువపేట, భీమిలి 3వ వార్డు

ఇస్తామన్న భృతికి ఆలస్యమెందుకు?



కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు ఇస్తామన్న చేపల వేటనిషేధ భృతి రూ. 20వేలు చెల్లింపులో జాప్యం తగదు. వేటసామగ్రి మరమ్మతులకు, నిషేధ సమయంలో చేసిన అప్పుల వడ్డీలకైనా ఇచ్చే భృతి ఉపయోగపడుతుంది.

దూడ సత్తిరాజు, మత్స్యకారుడు
ఎగువపేట, భీమిలి3వ వార్డు

ఎమ్మెల్యే గంటా దృష్టికి ఇళ్ల స్థలాల సమస్య



సమస్యను ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న వేములవలస కాలనీ వాసులు

ప్రజాశక్తి-ఆనందపురం :మండలంలోని వేములవలస కాలనీలోఇళ్లస్థలాల సమస్యను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి వేములవల కాలనీ వాసులు తీసుకెళ్లారు. ఆదివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిసిన వేములవలస కాలనీ వాసులు ఇళ్ల స్థలాల విషయం గంటాకు విన్నవించారు. గత ప్రభుత్వ హయాంలో ఇల్లు స్థలాలు పంపిణీలో అవకతవకలు జరిగాయని, అర్హులకు ఇల్లు స్థలాలు అందలేదని ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు వివరించారు. అర్హులందరికీ ఇల్లు స్థలాలు ఇప్పించడానికి చర్యలు చేపట్టాలని కోరారు కార్యక్రమంలో వేములవలస టిడిపి ప్రెసిడెంట్ అట్టాడ బంగారు నాయుడు, వార్డు సభ్యులు కోరాడ దామోదర్., బోధ రాజు, పార్టీ కార్యకర్తలు మాదాసు శ్రీరామ్‌దొర, కోరాడ శ్రీనివాస్, బోధ శ్రీను, మాదాసు వెంకటేష్ పాల్గొన్నారు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని ఈనెల 5 నుంచి వచ్చేనెల 6 వరకు తాత్కాలికంగా నిలిపేయనున్నట్లు డిఎల్‌డిఒ బి లక్ష్మీపతి తెలిపారు. ఎన్నిక కోడ్ ముగిసిన తర్వాత యథావిధిగా కొనసాగుతుందని స్పష్ట చేశారు. భీమిలి పట్టణంతోపాటు మండలంలోని ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు. వచ్చేనెల 6న ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత గ్రీవెన్స్‌కు సమస్యలతో రావచ్చని సూచించారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

ప్రజాశక్తి- గోపాలపట్నం :గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో 1987-88 బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో గతంలో హైస్కూల్ వందేళ్ల సంబరాలు జరిపారని, ఇపుడు స్నేహితుల దినోత్సవం జరుపుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, విశాఖ విమానాశ్రయం సలహా మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు స్నేహం, స్నేహితులు గొప్పతనాన్ని వివరించారు. కేక్ కట్ చేశారు పరస్పరం స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కేర్ సంస్థ ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కెవి నరసింహం, నక్కన చంద్రశేఖర్, ప్రసన్న మాస్టర్, అప్పారావు, సుబ్బరాజు, జగన్ పాల్గొన్నారు.

నీటి మోటార్ ఏర్పాటుకు ముందుకొచ్చిన శ్రీనుబాబు

నీటికి ఇబ్బందులు పడుతున్న హైస్కూల్‌లో బాలికల ప్రాంగణం వద్ద మంచినీటి మోటార్‌నుఏర్పాటుకు పాఠశాల పూర్వ విద్యార్థి గంట్ల శ్రీనుబాబు ముందుకొచ్చారు. మంచినీటి మోటారుకు అయ్యే ఖర్చును , ఈనెల 18న స్నేహితుల ఆధ్వర్యంలో ప్రారంభిస్తానని ప్రకటించారు.

సీతమ్మధార : స్థానిక బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో ఇస్కాఫ్, గాంధీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యవక్తలుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ వి బాలమోహన్‌దాస్, విశాఖ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ డాక్టర్ పికె.జోష్, కేరళ కళాసమితి అధ్యక్షులు ఉన్నికృష్ణన్, ఉత్కల్ కళాసమితి అధ్యక్షులు జితేంద్ర నాయక్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇస్కాఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు సుకుమారన్, మార్కండేయులు ఆధ్వర్యంలోవేడుకలో సోషల్ మీడియా చైర్మన్ సన్‌మూర్తి, ఇస్కాఫ్ ప్రతినిధులు రాంప్రభు, అప్పలరాజు ఉప్పల, మధుమతి, సత్యవతి, సూర్య కుమారి, శ్యాంసుందర్, సిహెచ్ మధుబాబు పాల్గొని ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టారు.

అనకాపల్లి : అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రింగ్ రోడ్డు జంక్షన్ నుండి లాంగ్ వాక్ పోటీలను ట్రాఫిక్ సిఐ పైడపునాయుడు ప్రారంభించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఎన్టీఆర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు పెంటకోట నర్సింగరావు, పిఎస్అప్పారావు, బిఎస్ఎంకే జోగినాయుడు, పెంటకోట ప్రభాకర్, బగ్రికలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గణబాబును అభినందిస్తున్న శ్రీనుబాబు

జార్జ్ క్లబ్ షటిల్ హబ్, జిమ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సం నిర్వహించారు.జార్జి క్లబ్ పెద్దలు డాక్టర్ కే.విష్ణుమూర్తి దంతులూరి దిలీప్ కుమార్, కొణతాల మురళీకృష్ణ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.క్లబ్ ప్రతినిధులు బిఎస్ఎంకే జోగినాయుడు, బుద్ధ కాశి విశ్వనాథం వి. చంద్రశేఖర్, ఆళ్ళ రామచంద్రరావు పాల్గొన్నారు. జార్జ్ క్లబ్ జిమ్ సభ్యులు ఎంఎస్ఎన్.అప్పారావు, జగన్నాథ స్వామి దేవాలయ చైర్మన్ దాడి బుజ్జి ఆధ్వర్యంలో జరిగిన స్నేహితుల దినోత్సవం నిర్వహించారు.

దేవరాపల్లి : స్థానిక ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళ సభ్యులందరూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ కేక్ కట్ చేశారు. వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం మహిళలు పాల్గొన్నారు

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ విఫలం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రమణ, గీతాకృష్ణ ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ అనకాపల్లి జిల్లా ప్లీనరీ సమావేశాలు 3, 4 తేదీలలో దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో వున్న వసతి, విద్యా దీవెన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవన్ నిర్మించాలని కోరారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, చట్టాలను పటిష్టంగా చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ నాయకులు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.శ్రీలక్ష్మి, చిన్నబ్బాయి మాట్లాడుతూ ఉద్యోగ పరిమితి వయస్సు పెంచడం దుర్మార్గమని, దానిపై ఎస్ఎఫ్ఐ పోరాటం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం 17 మందితో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా మామిడి రమణ, గిడుదురు గీతాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులుగా కేశవ, శ్రీను వెంకటేష్, కృపానంద్, దివాకర్, జనార్ధన్ తదితరులు ఎన్నికయ్యారు.



ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న వాడ నర్సాపురం గ్రామస్తులు

నాబ్ నిర్వాసితుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎన్ఎఓబి (నాబ్) నిర్వాసితుల సమస్యలపై ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌కు స్థానిక నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆదివారం అచ్యుతాపురంలో ఎమ్మెల్యే స్వగృహంలో వాడ నరసాపురం గ్రామానికి చెందిన అఖిలపక్ష పార్టీల నాయకులు కలిసి సమస్యలను తెలియజేశారు. ఈ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామారావు, మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, మాజీ ఎంపీటీసీ చెల్లూరి దేముడు, కొవిరి సోమేష్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి చోడపిల్లి ప్రసాద్, పెంటయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

దళిత హక్కుల కోసం ఎగ్గాడ పోరాటం

ప్రజాశక్తి- అనకాపల్లి : దళిత బహుజన హక్కుల కోసం కామ్రేడ్ ఎగ్గాడ నాగేశ్వరరావు నిరంతరం పోరాటం చేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి ఐఆర్.గంగాధర్ అన్నారు. అనకాపల్లి మండలం వేట జంగాలపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన ఎగ్గాడ నాగేశ్వరరావు 23వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎగ్గాడ నాగేశ్వరరావు తన జీవితాన్ని బహుజన వర్గాల అభ్యున్నతి కోసం వెచ్చించారని కొనియాడారు. దేశంలో సెక్యులర్ శక్తుల ఏకం కావలసిన అవసరం నేటి బహుజనులపై ఉందని గంగాధరన్నారు. ఈ కార్యక్రమంలో వేట జంగాల పాలెం మాజీ సర్పంచ్ పూడి చిన్నారావు, యువజన కాంగ్రెస్ నాయకుడు కొల్లి సత్యారావు, గ్రామ పెద్దలు బండి రాము, ఎడువాకుల దేవుడమ్మ, ఎగ్గాడ జాన్ పాల్, ఎగ్గాడ సత్తిబాబు మాట్లాడారు.

ఇరిగేషన్ కాలువ స్థలంలో ఇల్లు నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామంలో ఇరిగేషన్ పంట కాలువను అనుకొని చర్చి నిర్మాణం చేపడుతున్నారు. ఇటువంటి నిర్మాణం చేపట్టవద్దని స్థానికులు గత 31వ తెలియజేశారు. అయినా సదరు యజమాని వినకపోవడంతో ఈనెల 2న ఎమ్మార్వోకి, డిపిఓ శిరీష రాణికి ఫిర్యాదు చేశారు. అయినా యధేచ్ఛగా నిర్మాణం చేపట్టడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ మూడు గ్రామాలకు సంబంధించిన ఇరిగేషన్ కాలువ అని, భవిష్యత్తులో కాలువలో పేరుకుపోయిన సిల్టు తొలగించేందుకు సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో కాల్వను ఆనుకొని ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని, దీనిపై ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సత్యనారాయణస్వామి కొండపై 2000 సీడ్ బాల్స్

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రీన్ క్లైమేట్, వనమాలి గార్డెనర్స్ సహకారంతో ఆదివారం రెండు వేల సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సత్యనారాయణపురం సత్యనారాయణ స్వామి కొండ పైనుంచి జరిగిన ఈ కార్యక్రమాన్ని జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, వక్షమిత్ర అవార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాస్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా మొక్కలు పెరిగి వక్షాలై పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయన్నారు. అనంతరం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ అటవీ శాఖ అధికారి బి వినోద్ కుమార్, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ వంకాయల ఈశ్వరరావు, బేతాళం శేష సాయి, కొడమంచిలి సుందర శ్రీనివాస్, మైశెట్టి సత్తిబాబు పెంటకోట సురేష్, ఆర్. అనిత ఎల్లపు సంతోష్, గంట్ల కృష్ణ, కర్రి హనుమంతరావు, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంజిహెచ్ స్కూల్లో 91-92 బ్యాచ్ టెన్త్ క్లాస్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం తోటాడ రోడ్‌లోని కాండ్రేగుల నాయుడు లేఔట్‌లో ఆదివారం నిర్వహించారు. దీనికి ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి సుమారుగా 150 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమతో చదువుతున్న మిత్రుల పిల్లలు చదువులో ఉన్నత స్థాయిలో మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ ప్రోత్సాహక అవార్డు నిమిత్తం, కోవిడ్ సమయంలో మృతిచెందిన మిత్రుడు దొడ్డి ఉమా కుమార్తెలకు ఆర్థిక సహాయం డిపాజిట్ ద్వారా 50వేల రూపాయలు విల్లూరి పరమేశ్వరరావు ద్వారా సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల జగన్నాధరావు, కొణతాల అప్పలరాజు, పీలా రాముడు, కొణతాల గంగాధర్, కట్టా సాయి, కోరిబిల్లి రమేష్, కృష్ణంరాజు, కర్రి గంగాధర్ పెంటకోట బలరాం, బివిఎస్ అప్పారావు, దువ్వాడ గణేష్, షణ్ముఖ స్వీట్స్ భాను, రాము, ఇతర స్నేహితులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- వడ్డాది : అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున వడ్డాది హైస్కూల్లో అమ్మ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎస్సై డి ఈశ్వరరావు, వందేమాతరం బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్ బాబు, టిడిపి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, జడ్పిటిసి దొండా రాంబాబు, గ్రామ పెద్దలు ఆదివారం వడ్డాదిలో ఆవిష్కరించారు. 2022లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 678 యూనిట్లు బ్లడ్ సేకరించామని, ఈ దఫా అంతకంటే ఎక్కువ సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు, గ్రామ పెద్దలు ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇండియన్ నేవీ బాక్సింగ్ ట్రైల్స్‌కి ధనుష్ ఎంపిక



ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రశాంతి జూనియర్ కాలేజీ ఎన్‌సిసి కడేట్ ఎ.ధనుష్ ఇండియన్ నేవీ చీఫ్ పెట్టి ఆఫీసర్ బాక్సింగ్ కోటాలో జరిగే ట్రైల్స్‌కి ఎంపికయ్యాడు. ఈనెల 13న ముంబైలో ఐఎన్ఎస్ హామ్‌లాలో నిర్వహించే పోటీలలో ధనుష్ ప్రతిభ కనబరిస్తే ఇండియన్ నేవీలో నేరుగా ఉద్యోగం పొందుతాడని ప్రిన్సిపల్ అప్పలనాయుడు తెలిపారు. విశాఖపట్నం గ్రూపు నుండి ప్రతిభ కనబరిచిన ధనుష్‌ని ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ దరిమిరెడ్డి ప్రసాద్ అభినందించారు.

కొణతాలను కలిసిన స్టాండింగ్ కమిటీ అభ్యర్థులు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణని ఆదివారం జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ కూటమి అభ్యర్థులు 10 మంది కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

ఎంఇఒలకు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి-సబ్బవరం : జిల్లాలోని బుచ్చయ్యపేట, సబ్బవరం మండలాల్లోని పాఠశాలలను పొగాకు రహిత పాఠశాలలుగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన ఈ రెండు ఎంఈఓలకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సబ్బవరం ఎంఈఓ ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ బుచ్చయ్యపేట మండలానికి చెందిన ఎంఈఓ-1 జయలక్ష్మి జూలై 31న ఉద్యోగ విరమణ చేయడంతో ఆమె హాజరు కాలేదని, ఎంఈఓ- 2 బి విశ్వేశ్వరరావు, సబ్బవరం ఎంఈఓ- 1 ఎస్.లక్ష్మణరావు, ఎంఈఓ-2 బిఎన్ఎన్ మూర్తిలకు ప్రశంస పత్రాలను అందజేసినట్టు చెప్పారు.

దమ్ముల్లో రైతుల నిమగ్నం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వరి నాట్లుకు సంబంధించి పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో సాగునీటి అవకాశం ఉన్న మంగళాపురం, కుమ్మందానపేట, విజయరామరాజుపేట, వడ్డాది, బంగారు మెట్ట, చిన్నప్పన్నపాలెం తదితర గ్రామాల్లో దమ్ముదుక్కి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు ట్రాక్టర్లతో పంట పొలాలను దమ్ములు చేస్తున్నారు. వరి నాట్లువేస్తున్నారు. వర్షాధారంగా సాగు అయ్యే దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం, నీలకంఠాపురం, త్రైపురం తదితర గ్రామాల్లో వ్యవసాయ మోటార్ల, బావులు ఆధారంగా సాగునీటి అవకాశం పలువురు రైతులు దమ్ములు చేస్తున్నారు. వర్షాలు కురవకపోవడంతో ఈ గ్రామాల్లో వరి నాట్లు మందకొడిగా సాగుతున్నాయి.



దమ్ము దుక్కి దున్ను తున్న దృశ్యం

అభివృద్ధి పథంలో చౌడువాడ పిఎసిఎస్

రూ.11 కోట్లకు పైబడి లావాదేవీలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ ప్రాథమిక వ్యవసాయ సహకారం పరపతి సంఘం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. ఈ సొసైటీ దినదిన అభివృద్ధి చెందుతూ, రైతులకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ వారి ప్రశంసలు పొందుతుంది. అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఇతర బ్యాంకులతో నేడు ఈ సొసైటీ పోటీ పడుతుంది. రైతులకు కావలసిన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉండడం ఈ సొసైటీ ప్రత్యేకత. లాభార్జన లక్ష్యంగా పనిచేయకుండా రైతుల శ్రేయస్సే ముఖ్యంగా ఈ సొసైటీ పనిచేస్తుంది.

మండలంలో చౌడువాడ సొసైటీతో పాటు ఎ.కోడూరు, పాతవలస, మేడిచర్ల గ్రామాలలో గతంలో ప్రాథమిక సహకార సంఘాలు ఉండేవి. అవి ఆర్థిక ఒడిదుడుకుల వలన మూతపడగా చౌడువాడ పరపతి సంఘం మాత్రం అన్ని ఒడిదుడుకులను ఎదుర్కొని సొంత భవనం నిర్మించుకొనే స్థాయికి ఎదిగింది. ఈ గ్రామంలో సొసైటీ ఏర్పడిన తర్వాత ఇటీవల వరకు సరియైన భవనం లేక సిబ్బంది ఇబ్బంది పడడంతో పాటు రైతులకు కావలసిన ఎరువులు అందజేయుటకు ఇబ్బంది ఏర్పడేది. దానిని దృష్టిలో పెట్టుకొని మల్లం పాలెం వెళ్లే తారు రోడ్డుకు పక్కన నూతన భవనం ఏర్పాటు చేశారు. నేడు ప్రభుత్వం ఇస్తున్న అన్ని రకాల రాయితీలు, రుణ సదుపాయాన్ని అందజేస్తున్నారు. తగిన హామీ పత్రాలతో ఇతర అవసరాలకు కూడా ఈ సొసైటీలో రుణ సదుపాయం కల్పించబడుతుంది. రెండు సంవత్సరాల క్రితం రూ.4 కోట్లు వ్యాపారం ఉన్న సంఘం ప్రస్తుతం రూ.11 కోట్లకు పైబడి అన్ని రకాల లావాదేవీలు సాగిస్తున్నారు. ఈ సొసైటీ నందు సెలవు దినాల్లో తప్ప ఏ రోజైనా బ్యాంకు పని చేసే సమయంలో ఆభరణాలపై ఇతర బ్యాంకుల కన్నా తక్షణంగా రుణ సదుపాయము కల్పించబడుతుంది. ఈ సొసైటీలో లాకర్ సదుపాయం కూడా ఉంది. ప్రస్తుతం ఈ సొసైటీ ఇతర బ్యాంకులతో పోటీ పడుతూ తనదైన శైలిలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందిస్తోంది. ఈ సొసైటీలో చౌడువాడ, మల్లమ్మ పాలెం, గరుగుబిల్లి, పైడంపేట, పాచిలవానిపాలెం, గుల్లేపల్లి, గొండుపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు సేవలు పొందుతున్నారు. ఈ సొసైటీలో ప్రతి ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది ప్రభుత్వం ప్రైవేటు సిబ్బందిని ధాన్యం కొనుగోలు కేంద్రంలో నియమించడంతో వారు సక్రమంగా విధులు నిర్వహించుకోవడంతో అనుకున్న రీతిలో ధాన్యం సేకరణ జరగలేదు.



చౌడువాడ పిఎసిఎస్ భవనం

రైతుల సంక్షేమమే ధ్యేయం



మా సొసైటీలో పనిచేస్తున్న సిబ్బంది ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తున్నాం. రైతులకు, ఖాతాదాలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా సంఘం చేస్తుంది. త్వరలో రైతుల ఆయా గ్రామాలు ప్రజల శ్రేయస్సుకు ఇంటి డాక్యుమెంట్లు తాకట్టు పెట్టి రుణ సదుపాయం కూడా కల్పించడం జరుగుతుంది.

- బత్తిన సత్యనారాయణమూర్తి, ముఖ్య కార్యనిర్వహణ అధికారి



రద్దు చేసిన డి.పట్టాను చూపిస్తున్న మాజీ సర్పంచ్

డి.పట్టాలను 2018లోనే రద్దు చేశారు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని కొండెంపూడి సర్వేనెంబర్ 5లో కడియాల రామారావు, కడియాల రామచంద్రరావులకు ప్రభుత్వం 1990 సంవత్సరంలో మంజూరు చేసిన డి.పట్టాను 2018లోనే రద్దు చేసినట్లు మాజీ సర్పంచ్ అదే్రావు సత్యనారాయణ, దొండా శ్రీను, సయ్యపరెడ్డి జగదీష్, ఆది ప్రసాద్, ఆది రమేష్, అదే్రావు మహేష్ తదితరులు తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆ భూములను కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కేటాయించినట్లు చెప్పారు. కృషి విజ్ఞాన కేంద్రం నిర్మాణం వల్ల గ్రామానికి చెందిన సుమారు 20 కుటుంబాల వారు 50 ఎకరాల భూములను కోల్పోయారని, వారికి ప్రత్యామ్నాయంగా భూములు ఇవ్వడానికి గతంలోనే చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ భూములకు 2018లో డి-పట్టాను రద్దు చేసి ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులను గత ప్రభుత్వంలోనే రెవిన్యూ అధికారులు ఏర్పాటు చేసారని తెలిపారు. 2019 తర్వాత గ్రామానికి చెందిన పలువురు సదరు భూములను ఆక్రమించుకున్నారన్నారు. ప్రభుత్వం రద్దు చేసిన డి పట్టా వివరాలను, కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం భూములు ఇవ్వడానికి ఇచ్చిన ప్రొసీడింగ్స్ వివరాలను శనివారం స్థానిక తహసిల్దార్‌కు అందజేసినట్లు వారు తెలిపారు.

జిఎస్‌టి తొలగింపునకు కేంద్ర మంత్రి లేఖ రాయడం అభినందనీయం

ప్రజాశక్తి-దేవరాపల్లి : జీవిత, ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంపై ప్రభుత్వం విధిస్తున్న 18శాతం జిఎస్‌టిని తొలగించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారాంకు కేంద్ర రోడ్లు, రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరి లేఖ రాయడం అభినందనీయమని ఎల్ఐసి ఏఓఐ స్టేట్ ఈసీ మెంబర్ కె.వి రమణ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎల్ఐసి ఉద్యోగ సంఘాలు, ఏజెంట్ల యూనియన్ల అభ్యర్థన మేరకు ఆర్థిక మంత్రికి గడ్కరి లేఖ రాయడంపై హర్షం వ్యక్తం చేశారు.

రోటరీ క్లబ్ మెంబర్ షిప్ సదస్సు

ప్రజాశక్తి- అనకాపల్లి : రోటరీ క్లబ్ జిల్లా మెంబర్ షిప్ సెమినార్ జిల్లా గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రీజనల్ కోఆర్డినేటర్ పిడిజి దీపక్ పురత్ హాజరయ్యారు. జిల్లా మెంబర్షిప్ కోఆర్డినేటర్ ఎం వీరభద్రారెడ్డి, జిల్లా మెంబర్షిప్ చైర్ ఏవి రంగారావు, సెమినార్ చైర్ బుద్ధ రమణాజీ, సెమినార్ కో చైర్ కే సతీష్, క్లబ్బు అధ్యక్షులు ఎస్ రాజేష్, కార్యదర్శి డి అనిల్, పి రాజేశ్వర ప్రసాద్, బి.సోమ సుందర్, అసిస్టెంట్ కే మురళీకృష్ణ అధిక సంఖ్యలో రొటేరియన్లు పాల్గొన్నారు.

వెంకటరావుకు సేవా పురస్కారం

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక జోడుగుల్లకు చెందిన బంగారు తల్లి సేవా సమితి సంఘం అధ్యక్షుడు సింగంపల్లి వెంకటరావుకు సేవా పురస్కార అవార్డు లభించింది. శ్రీకాళహస్తికి చెందిన యువతరం సేవా సమితి 10వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన సేవా కార్యక్రమాలు అందించిన వారికి సేవా పురస్కార అవార్డులను అందజేశారు. సింగంపల్లి వెంకటరావు ఆంధ్ర రాష్ట్రం నుండి ఈ అవార్డుకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ సేవా పురస్కార్ అవార్డు తనకు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



వెంకటరావును అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

జిఒ 117ను రద్దు చేసిన తరువాతే

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి- అనకాపల్లి : జిఓ 117ను రద్దు చేసిన తరువాతే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు ఆఫీసులో జరిగిన జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా పాఠశాల విద్యా సమస్యలు ఇంకా పరిష్కరించలేదని వాపోయారు. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన జిఓ 117 వలన ప్రభుత్వ పాఠశాలలు దివాలా తీశాయన్నారు. జిఓ 117 రద్దు చేసి, పాత జిఓ 53 ప్రకారం ఉపాధ్యాయ పోస్టులు సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీలో పోస్టులు భర్తీ చేయడానికి జిఓ 117 ఆటంకమని చెప్పారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఒకే పాఠశాలలో తరగతులు నిర్వహించాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలలను రక్షించి, విద్యను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాఠశాల విద్యాశాఖలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వి.శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు కట్టా శ్రీను, గాయత్రి, జిల్లా కార్యదర్శులు దొగ్గా శ్రీను, జివిఎస్ ప్రకాష్, కోశాధికారి జోగా రాజేష్, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ఆదివారం అనకాపల్లి సర్వసాామాందా పార్క్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నా నుద్దేశించి ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు వై ఎన్ భద్రం మాట్లాడుతూ గత ప్రభుత్వం సంక్షేమ బోర్డు పథకాలను పూర్తిగా నిలుపుదల చేసి బోర్డులో ఉన్న కార్మికుల సొమ్ము నిధులు మళ్లించడం ద్వారా ప్రభుత్వ అవసరాలు తీర్చుకుందని తెలిపారు. సుమారు ఏడు సంవత్సరాలుగా చనిపోయిన భవన నిర్మాణ కార్మికులకు చెల్లించాల్సిన బీమా పరిహారం చెల్లించలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 44 వేల క్లైములు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు కలుగచేసుకుని అనకాపల్లి పట్టణానికి అతి సమీపంలో ఇసుక ర్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు మొల్లేటి ఈశ్వరరావు, మద్దాల నూకేష్, చిన్ని సత్తిబాబు, చిన్ని శ్రీను, కరోతి శ్రీను, చిన్ని చిన్న, శ్రీరామదాసు అబ్బులు, తాకాసి వెంకటేశ్వరరావు, కోరుబిల్లి శంకర్రావు పాల్గొన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయాలని నిరసన

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని గరిసింగి పంచాయతీ పరిధి గిరిజన గ్రామాల్లో వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యాన శనివారం పంచాయతీ కేంద్రంలో ఆదివాసీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిటి దొర మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో వీధి లైట్లు లేకపోవడంతో అడవి జంతువులు, పాములు భయంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కించుమండ, డోర్రచెరువు, కొత్తూరు, తాటిపూడి, ఎలాం బైలు, సంతపాలెం, రేగుల బంద, చింతల పాలెం గ్రామాల్లో గిరిజనులు కటిక చీకట్లో మగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్లు కోసం వచ్చినప్పుడు హామీలు ఇవ్వడం, గెలిచాక పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిందని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వీధి లైట్లు వేయకుంటే ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చెరుకు దేముడు, జన్ని దేముడు, బాబుజీ, సోములు, గిరిజనులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజనులు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-వడ్డాది

గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని బుచ్చయ్యపేట ఎస్సై డి.ఈశ్వరరావు అన్నారు. అమ్మ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం వడ్డాదిలో 2.5కెరన్, అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిని గ్రామ పెద్దలతో కలిసి ఎస్ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకసారి డ్రగ్స్ కేసులో ఇరుక్కుంటే జీవితాలు నాశనమైపోతాయని తెలిపారు. విద్యార్థి దశలో ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రన్నింగ్ పోటీల్లో మారథాన్ వాకింగ్ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి నగదు పురస్కారం ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, జడ్పిటిసి దొండా రాంబాబు, ఉత్తరాంధ్ర రక్తదాన ప్రచారకర్త వినోద్ బాబు, గ్రామ పెద్దలు, యువకులు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది ఎస్సీ ఎస్టీ సంక్షేమ హాస్టల్ల విద్యార్థులకు రిటైర్డ్ జడ్జ్, చోడవరం అంబేద్కర్ ట్రస్ట్ చైర్మన్ నడుపూరు సన్యాసిరావు శనివారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కండిపల్లి వెంకట్రావు, జె.అప్పారావు, పి.పైడ్రాజు, రిటైర్డ్ ఐఆర్ఎస్ ఆఫీసర్ డి.సుందరరావు, రిటైర్డ్ ఏఎస్పీ ప్రకాష్ రావు, వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరుగుడు సాగుపై రైతుల ఆసక్తి

- ముమ్మరంగా నాట్లు
- చెరుకు గిట్టుబాటు కాకపోవడమే కారణం



సరుగుడు నారు తీస్తున్న రైతులు

ప్రజాశక్తి-వడ్డాది

వరి, చెరకు పంటలు గిట్టుబాటు కాకపోవడంతో రైతులు సరుగుడు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో పల్లపు భూముల్లో సైతం సరుగుడు నాట్లు విస్తారంగా వేస్తున్నారు. తక్కువ పెట్టుబడి ప్రతికూల పరిస్థితులతో సంబంధం లేకుండా పంట చేతికొచ్చే పరిస్థితులు ఉండడంతో రైతులు అధికంగా సరుగుడు సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఒక్కసారి నాటితే ఐదు సంవత్సరాలకు చేతికి అందిస్తుంది. ప్రస్తుతం క్లోన్ మొక్కలు అందుబాటులోకి వచ్చాయి. ఎకరాకు 70 నుంచి 100 టన్నులు వరకు దిగుబడి వస్తుంది. ఎకరాకు సరాసరి సుమారు రూ.5 లక్షల పైబడి పంట ఆదాయం రావడంతో రైతుకు కాస్త గిట్టుబాటు అవుతుంది. ఒకప్పుడు ఎకరాకు రూ.2 లక్షలు పైబడి ఆదాయం రావడం కష్టంగా ఉండేది. అలాంటి ఐదేళ్ల వయసులో గల సరుగుడికి సంవత్సరానికి ఎకరానికి లక్షపైగా మొత్తం ఐదేళ్లకి ఐదు లక్షల రూపాయలు పైబడి ఆదాయం వస్తుండడంతో రైతులందరూ సరుగుడు సాగు వైపు ముగ్గు చూపుతున్నారు

మండలంలో 9 వేల ఎకరాలకు పైగా సరుగుడు సాగు

మండలంలో కనిష్ట స్థాయిలో ఉండే సరుగుడు సాగు విస్తీర్ణం నేడు చెరకు వరి సాగు విస్తీర్ణాన్ని అధిగమించింది. ప్రస్తుతం 9 వేల ఎకరాలకు పైబడి విస్తీర్ణానికి ఎగబా అధిక సాగు విస్తీర్ణంలో మొదటి స్థానంలో నిలిచింది. ఒకప్పుడు వర్షాధారంగా నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సరుగుడు సాగు ఉండేది. నేడు నీటి వనరులు కలిగి ఉన్న పల్లపు భూముల్లో సైతం సరుగుడు సాగు అవుతుంది.

ఒకప్పుడు చెరుకు ప్రధాన పంటగా ఉండేది. అయితే పెరిగిన పెట్టుబడులు, ఆ మేరకు గిట్టుబాటు కాకపోవడంతో రైతులు చెరుకు పట్ల ఆసక్తి చూపడం లేదు. సరఫరా చేసిన చెరుకుకు గోవాడ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లింపులను సకాలంలో చేయడం లేదు. దీంతో చెరుకు సాగు నేడు కనిష్ట సాయికి పడిపోయింది. మరో వైపు వరిసాగు గిట్టుబాటు కాకపోవటం కూడా ఒక కారణమని చెప్పవచ్చు. దీంతో మండలంలో చెరుకుకు ప్రత్యామ్నాయంగా రైతులు సరుగుడు సాగును ఎంచుకుంటున్నారు. అలాగే సరుగుడు ధరలు ఆశాజనకంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. మార్కెట్లో ఆరు నెలల క్రితం వరకు టన్నుకు బాదురకం రూ.4800, మొక్క రకం రూ.2850 ఉండగా, గత మూడు నెలలుగా సరుగుడు ధర క్రమేపి పెరగడంతో నేడు టన్నుకు బాదురకం రూ.7000 నుండి రూ.8000, ముక్క రకం రూ.6100 పలుకుతుంది. దీంతో మెట్టు పల్లం తేడా లేకుండా నీటి వనరులు కలిగి ఉన్న వాణిజ్య పంట సాగు చేసే రైతులకు కూడా సరుగుడు సాగు చేపట్టారు.

మండలంలోని వడ్డాది, లోపూడి, విజయరామరాజుపేట, మంగళాపురం, ఎల్బీపీ అగ్రహారం, పొట్టి దోరపాలెం, కొండంపూడి గంటి కొర్లం, కోమల్లపూడి, కొండంపూడి, కేపీ అగ్రహారం, కొండపాలెం, బుచ్చయ్యపేట, కందిపూడి, దిబ్బిడి, పోలేపల్లి, రాజాం, నీలకంఠపురం, ఆర్ శివరాంపురం, పెదమదిన, గున్నెంపూడి, కరక, తురకలపూడి, చిట్టియ్యపాలెం, పెదపూడి, పిపి అగ్రహారం తదితర గ్రామాల్లో సరుగుడు సాగు చేపట్టారు. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు చేసిన ప్లై వుడ్ తయారీ కర్మాగారానికి రోజుకు 1000 టన్నుల వరకు సరుగుడు సుబాబుల్ అవసరం కావడంతో మార్కెట్లో ఈ తోటలకు గిరాకీ ఏర్పడింది. దీంతో వీటి ధరలకు డోకా ఉండదన్న ధీమాతో రైతులు ఉన్నారు.

సాగని వరి నాట్లు

ప్రజాశక్తి-నక్కపల్లి:వరి నాట్లు వేసేందుకు అన్నదాత వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. నాట్లు వేసేందుకు వరి ఆకు సిద్ధంగా ఉన్నప్పటికీ వర్షాలు లేకపోవడంతో వరి నాట్లు ముందుకు సాగడం లేదు.

మండలంలోని ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 4400 ఎకరాల సాధారణ విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేయనున్నారు. ఈ మేరకు వరి నాట్లు నాటే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జూన్ నెలలో రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. సకాలంలో వర్షాలు కురవడంతో రైతులు వెనువెంటనే వరి నారుమడులను సిద్ధం చేసుకుని వరి ఆకు కోసం వరి విత్తనాలు జల్లారు. జులై మొదటి వారంలో వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు వర్షాల కోసం చూసే పరిస్థితి ఏర్పడింది. నీటి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో రైతులు వరి ఆకు రక్షించుకునేందుకు తడులు పెట్టారు. అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు వరి ఆకుకు ఊపిరినిచ్చాయి. దీంతో మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వరి నాట్లు వేసేందుకు వరి ఆకు సిద్ధమైంది. జులై నెలాఖరులో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో వరి మడుల్లో వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో ఆయా గ్రామాల్లో రైతులు వరి నాట్లు వేసేందుకు మడులను సిద్ధం చేసి వరి నాట్లు ప్రారంభించారు.

ఉద్దండ పురం, గొడిచెర్ల, డొంకాడ, ఉపమాక, తదితర గ్రామాల్లో నీటి లభ్యత ఉన్న వరి మడుల్లో ఇప్పటికే అక్కడక్కడా వరి నాట్లు వేశారు. అయితే సమృద్ధిగా వర్షాలు లేకపోవడంతో ఇంకా పూర్తిస్థాయిలో వరి నాట్లు ప్రారంభం కాలేదు. నాట్లు వేసేందుకు వరి ఆకు సిద్ధంగా ఉంది. వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. వర్షం కురిస్తే వరి నాట్లు ముమ్మురంగా చేపట్టేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు .



వరి నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన వరిమడులు



చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో 'చదవడం మా కిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులతో పుస్తక పఠనం చేశారు. పుస్తకాలు చదవడంతో విజ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయాధికారి తెలిపారు.

గిరిజన యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం చీమలపాడు శివారు దూకులంపాడు గ్రామానికి చెందిన గిరిజన యువకుడు అదృశ్యం అయ్యాడు.



చిన అప్పారావు (ఫైల్)

ఈ ఘటనపై కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు ఆదివారం తెలిపిన కథనం మేరకు... దూకులంపాడు గ్రామానికి చెందిన ఈదల చినఅప్పారావు (35) శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా సోదరి గడ్డమ్మ ఎక్కడికి వెళ్తున్నావ్ అని అడిగింది. ఆదివారం మధ్యాహ్నం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో యువకుని సోదరి ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు. చిన అప్పారావు గ్రామ సమీపంలో కల్యాణపులోవ జలాశయంలో తరచూ చేపల వేటకు వెళ్తున్నట్టు తమ దర్యాప్తులో తెలిందన్నారు. యువకుడు వాడిన నాటు పడవ (దోనే)లో తన చేతి తువ్వాలి, కత్తి ఉన్నాయని చెప్పారు. జలాశయంలో జారీ పడిపోయాడా లేక ఏమైనా జరిగిందా అన్నది తెలియాల్సి ఉందన్నారు. ఘటనా స్థలంలో గజ ఈత గాళ్ళు, ఫైర్ సిబ్బంది తో ఆచూకి కోసం ప్రయత్నం చేశామన్నారు.

గ్రామాల్లో ఘనంగా పండుగలు

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండలో నూకాలమ్మ జాతర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా ఈ మహోత్సవం జరుగుతోంది. ఈ మేరకు ఆదివారం ఉదయం నుంచి సంబరం నిర్వహించారు. డప్పులు, వాయిద్యాల మధ్య ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

చౌడేశ్వరి అమ్మవారికి పూజలు

నర్సీపట్నం టౌన్: శ్రీగౌరీ శంకర దేవాంగ సంఘం ఆధ్వర్యంలో శ్రీచౌడేశ్వరి అమ్మవారికి ఆదివారం బలిఘట్టం ఉత్తరవాహిని వద్ద విశేష పూజలు చేశారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు, లలిత సహస్రనామాలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ వెన్న నెహ్రూ, వైస్ ప్రెసిడెంట్ బూడిద గంగ బాబు, కార్యదర్శి జెట్టి శంకర్‌రావు, కోశాధికారి సాంబశివ మాస్టారు, చందన ఉమా, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

నక్కపల్లి:మండలంలోని ఉద్దండపురం లో నెల్లిపూడి రోడ్డు లో వున్న రాళ్లమ్మ తల్లి పండగ ను ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు .పెద్ద సంఖ్యలో భక్తులతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.అమ్మవారిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకష్ణ ,నాయకులు పొడగట్ల పాపారావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన సభ్యులు

ఎపిఇఎంజెఎ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఏపీయూడబ్ల్యూజే అనుబంధ సంస్థ ఏపిఈఎంజేఏ నర్సీపట్నం సర్వసభ్య సమావేశంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పెంటకోట జోగినాయుడు, రా నాయకులు సిహెచ్‌బిఎల్ స్వామి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చింతల కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నర్సీపట్నం ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా విజయ్, కార్యదర్శిగా శ్రీనివాస్ వర్మ, ఉపాధ్యక్షుడిగా ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా అప్పలనాయుడు, జాయింట్ సెక్రెటరీగా నాతవరం మండలానికి చెందిన వనిమిన శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఈశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు.


విభిన్న ప్రతిభావంతులకు డిజిటల్ వెలుగులు

-దృష్టి, వినికిడి లోపం విద్యార్థులకు ట్యాబుల్లో విద్యా బోధన

-ప్రత్యేక యాప్‌లతో పలు ప్రయోజనాలు -భవిత కేంద్రాలు, పాఠశాలల్లో అమలు

ప్రజాశక్తి- కొత్తకోట:పుట్టుకతో అంధత్వం.. వినికిడి సమస్యతో ఇబ్బందులు పడుతున్న వారిని సైతం డిజిటల్ వైపు నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష ద్వారా కృషి చేస్తుంది. పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో 'విజన్-2025 ఇన్ క్లూజివ్ ఆంధ్రా' ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'విజన్- 2025 ఇన్ క్లూజివ్ ఆంధ్రా' పేరిట దృష్టి, వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు ట్యాబులలో వివిధ యాప్స్ ద్వారా చదువును అందిస్తున్నారు. ప్రస్తుతం భవిత కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విభిన్న ప్రతిభావంతులకు అదునాతనంగా బోధన అందిస్తున్నారు.

అనకాపల్లి జిల్లాలో 166 మంది దృష్టి, వినికిడి లోపం గల దివ్యాంగ విద్యార్థులకు, ప్రత్యేక ఉపాధ్యాయులకు ట్యాబులను ఉచితంగా పంపిణీ చేశారు. దీంతో, వివిధ లోపాలతో బాధపడుతున్న తమ చిన్నారులు ఈ డిజిటల్ టెక్నాలజీ ద్వారా సాధారణ పిల్లలతో పోటీపడుతూ వెనుకబాటుతనాన్ని అధిగమిస్తున్నారని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మునుపటికంటే కొత్త విషయాలను అంతర్జాల సదుపాయంతో సులువుగా తెలుసుకుంటు న్నారంటున్నారు.



యాప్స్ లతో ప్రయోజనాలు

గూగుల్ లుక్ అవుట్ యాప్ : ఈ యాప్ ద్వారా దృష్టి లోపం ఉన్న పిల్లలు తమ చుట్టూ ఉన్న పరిసరాలు, వస్తువులను ఆడియో రూపంలో స ు ల ు వ ు గా గుర్తించగలరు. ఏ పదం ఎలా చదవాలి.. ఎలా గుర్తించాలి. అనే విషయాలు, వాక్యాలు నేర్చుకుంటారు.

కవి పిటీఎస్: కవి పి.టి.ఏస్ యాప్ ద్వారా బుద్ధిమాంద్యం ఉన్న పిల్లలు భాషకు సంబంధించిన సమస్యలను అధిగమించడానికి దోహద పడుతుంది.

జెల్లో కమ్యూనికేషన్ : ఈ యాప్ ద్వారా దివ్యాంగ విద్యార్థుల ఇబ్బందులను సైతం బొమ్మల ద్వారా తెలియజేస్తే ఆ విషయం అవతల వ్యక్తికి ఆడియో రూపంలో స్పష్టమవుతుంది.

లైవ్ ట్రాన్స్ స్క్రయబ్ : ఈ యాప్‌తో వినికిడి సమస్యతో ఇబ్బంది పడే విద్యార్థులకు ఉపాధ్యాయులు చెప్పే పాఠం మాటలు ట్యాబ్లో అక్షర రూపంలో కనిపిస్తుంది. ప్రతి విషయం అక్షర రూపంలో తెలుసుకుంటారు.

బీ మై ఐస్ : ఈ యాప్ ద్వారా అంధత్వం ఉన్న పిల్లలు కర్ర సహాయం, ఎవరి సహాయం లేకుండా గమ్యాన్ని చేరుకోవచ్చు. యాప్లో రూపొందించిన ఇంటర్నెట్ ప్రొటోకాల్, కెమేరా వాలంటీర్కు అనుసంధానం అవుతుంది. ప్రతి అడుగు, వెళ్లా ల్సిన గమ్యాన్ని వాలంటీర్ సహాయంతో తెలుసుకుంటూ వెళ్లవచ్చు.



ట్యాబ్‌లో నేర్చుకుంటున్న విభిన్నప్రతిభా వంతుడు

సులభంగా నేర్చుకుంటున్నారు



ప్రత్యేక ఉపాధ్యాయులకు యాప్‌ల వినియోగం గురించి ప్రత్యేకంగా శిక్షణను అందించడంతో భవిత కేంద్రాల్లో బోధించడం జరుగుతుంది. బుద్ధిమాంద్యం, పక్షవాతం, అంధత్వం ఉన్న పిల్లలు సులువుగా నేర్చుకోవచ్చు. వారికి ఈ ట్యాబ్ స్నేహితుడిలా ఉపయోగపడుతుంది. పిల్లల తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

బొడ్డు మహాలక్ష్మి నాయుడు,
రాష్ట్ర కీ రీసోర్స్ పర్సన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మేడివాడ.



నినాదాలు చేస్తున్న కమిటీ సభ్యులు

మూడు శాతం రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రెల్లి కులానికి మూడు శాతం రిజర్వేషన్ కల్పించాలని నర్సీపట్నం రెల్లి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అబీద్ సెంటర్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గతంలో ఇచ్చినట్లు కాకుండా.. కొంత మార్పు రావాలని ఆశిన్నామన్నారు. ఈ విభజనలో గతంలో రెల్లి, ఉపకులాలకు చాలా అన్యాయం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి భగీరథ, చెన్నా శ్రీనివాసరావు , మజ్జి దినేష్, జీసీసీ మేనేజర్ భాస్కరరావు, ఉపాధ్యాయులు శివకేశవ, ప్రకాశ్, జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పండ్ల మొక్కల పంపిణీ

ప్రజాశక్తి -అనంతగిరి:ఉపాధి హామీ పథకం కింద రైతులకు జీడీ. మామిడి మొక్కలు పంపిణీ చేస్తున్నామని ఏపిఎం ఎస్ కె.నాయుడు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో భీంపోలు పంచాయతీ గరుగుబిల్లి, గుమ్మ కోట, కాశీపట్నం, కొత్తూరు, చిలకలగెడ్డ, రొంపల్లి, ఎన్ ఆర్ పురం, లొంగపర్తిలో 68 మంది రైతులకు జీడి మామిడి మొక్కలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని బదిలీలు



ప్రజాశక్తి-కోటవురట్ల:ఎన్నికల ప్రక్రియ ఫలితాలు పూర్తయి రెండు నెలలు కావస్తోంది. మంత్రులు సైతం ప్రమాణ స్వీకారం చేపట్టి నెలన్నర దాటినా జిల్లా యంత్రాంగం మండల స్థాయి అధికారుల నియామకం పట్ల తర్జనభర్జన పడుతున్నారు. ఇప్పటికే జిల్లాస్థాయి రెవెన్యూ పోలీసు అధికారులు బదిలీల ప్రక్రియ పూర్తికాగా, ఇంకా మండల శాఖ అధికారుల నియామకంపై పాలకపక్ష ప్రతినిధులు తుది నిర్ణయానికి రాలేకపోతున్నారు ఇప్పటికే తహసిల్దారు బదిలీలపై వెళ్లారు. కాగా మండల పరిషత్ అధికారులు, రెవిన్యూ, సచివాలయ అధికారులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. బదిలీల ప్రక్రియలో ఎటు వెళ్లిపోతామని భావనలో పాలన పట్ల పెద్దగా దృష్టి సారించకపోగా కాలక్షేపం చేస్తున్న భావన వాళ్లలోనే కనిపిస్తుంది. సరైన నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేక పోవడంతో అధికారులు అందించే సేవలోను నిర్లిప్తత కనిపిస్తుంది. దీంతో, కూటమి పాలన వేగం పుంజుకున్నట్లు కనిపించలేదంటూ మండలంలో పలువురు చర్చించుకుంటున్నారు. ఇదే విషయాన్ని పలువురు నాయకులు ఎమ్మెల్యేల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. అధికారుల నియామకం జాప్యం కారణంగా ప్రస్తుతం సాధారణ పాలన సాగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఫిర్యాదులు చేసేందుకు సైతం ప్రజలు వెనకాడుతున్నారు. మండల స్థాయి అధికారుల నియామకం పట్ల ప్రజా ప్రతినిధులు ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారా లేక నమ్మకమైన అధికారుల కోసం జాప్యం చేస్తున్నారా అనే చర్చ కొనసాగుతుంది.

మండలానికి ప్రధానంగా తహసిల్దారు నియామకం చేపట్టాల్సి ఉంది. అలాగే మండల స్థాయి అధికారులైన మండల పరిషత్ అధికారులు, పోలీస్, ఇంజనీరింగ్ అధికారుల బదిలీలు చేపట్టాల్సి ఉంది.దాదాపుగా మండల స్థాయిలో అన్ని శాఖల అధికారుల మార్పు ఉండొచ్చని ఇప్పటికే ఉద్యోగులకు సంకేతాలు అందాయి. ఈ తరుణంలో అధికారులు నాయకులు చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఏది ఏమైనా అధికారుల బదిలీల ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేసి పాలనపై పట్టు సాధించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని మండల వాసులు ఎదురుచూస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

-సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ రైల్వేస్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని సిపిఎం విశాఖ జిల్లా జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు డిమాండ్‌చేశారు. కోర్బా- విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో బి 6, బి7, ఎం1 బోగీలు అగ్నికి పూర్తిగా ఆహుతి కావడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. బోగీలు దగ్ధం కావడానికి గల కారణాలు, పూర్తిగా దగ్ధం అయ్యేవరకు ప్రమాదాన్ని నివారించలేని కారణాలపై సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే దానిని నిలువరించే రక్షణ వ్యవస్థ విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో లేదా? అనే ఆందోళన తలెత్తుతోందని పేర్కొన్నారు. రైల్వే ఆస్తులు, ప్రయాణికుల రక్షణకు, ప్రమాదాల నివారణకు బడ్జెట్లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించినట్లు కేంద్ర రైల్వే శాఖా మంత్రి ప్రకటించారని, అయినా తరచూ రైలు ప్రమాదాలు జరగడం, ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. కేంద్ర రైల్వే మంత్రి ప్రకటనకు, ప్రమాదాల పెరుగుదలకు పొంతన లేదని ఆరోపించారు. గతంలో రైలు ప్రమాదాలు జరిగి ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తే నైతిక బాధ్యత వహిస్తూ ఆ శాఖ మంత్రులు తమ పదవులకు రాజీనామాలు చేసిన సందర్భాలు దేశంలో అనేకం ఉన్నాయని, కానీ ఎన్‌డిఎలోని మంత్రి కనీసం బాధ్యత కూడా వహించడం లేదని విమర్శించారు. ప్రమాదాల నివారణకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ట్రిపుల్ ఐటీకి నేహాసిని ఎంపిక

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో వెంకటాపురం గ్రామానికి చెందిన తమరాన నేహాసిని ట్రిపుల్ ఐటీ కి ఎంపిక కావడంతో విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గడిచిన విద్యా సంవత్సరంలో వెంకటాపురం జిల్లా పరిషత్తు పాఠశాలలో 10వ తరగతిలో 567 మార్కులు సాధించిన ఈ అమ్మాయి ఒంగోలు ట్రిపుల్ ఐటీ కి అర్హత సాధించింది. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లావుద్దీన్ మరియు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.



సత్యసాయి సేవలు అభినందనీయం

స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:రాష్ట్రవ్యాప్తంగా సత్యసాయి బాబా సేవలు మరువలేనివి రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం ఉత్తరవాహిని వద్ద పాతలపాటి గురుదేవుల ఆశ్రమం వద్ద ఆదివారం సాయి యువసర్వం అనకాపల్లి జిల్లా యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ ముందుగా మొక్కలు నాటారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సత్యసాయిబాబా ఆంధ్రప్రదేశ్‌లో 1,008 గ్రామాలు దత్తత తీసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ద్వారా ఎంతో మందికి వైద్యం అందించినట్లు తెలిపారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లతో భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, వారు సరైన దారిలో నడిస్తే ఏదైనా సాధించగలరని స్పీకర్ అభిప్రాయపడ్డారు.

మరిడమ్మను దర్శించుకున్న అయ్యన్న

గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం గ్రామంలో మరిడమ్మ ఆలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంప్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. హాస్పిటల్‌లో మరమ్మతులపై డాక్టర్ గాయత్రి స్పీకర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆశా వర్కర్స్ యూనియన్ వినతి

నర్సీపట్నంటౌన్:సమస్యలను పరిష్కరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడను క్యాంపు కార్యాలయంలో ఎ.పి. ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్స్‌లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, ఇతర సౌకర్యాలను కల్పించాలని వారు కోరారు. దీర్ఘకాలంగా పని చేస్తున్న ఆశా వర్కర్స్ కు కనీస వేతనాలు చెల్లించాలని, వారి సమస్యలు ప్రభుత్వ దృష్టిలో పెట్టి పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు.



గీతాలు ఆలపిస్తున్న ఐద్వా మహిళలు

సిపిఎం శిక్షణా తరగతుల్లో మహిళల 'విప్లవ గీతాలాపన'

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా సిపిఎం రాజకీయ శిక్షణా తరగతుల్లో ఐద్వా నేతలు ఆలపించిన విప్లవ గీతాలు, ఎర్రజెండా పాటలు ఆద్యంతం సభికులను ఆకట్టుకున్నాయి. ఈనెల 3, 4 తేదీల్లో నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం (ఎవికె)లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగన్ అధ్యక్షతన రెండు రోజులు రాజకీయ శిక్షణ తరగతులు పార్టీ కేడర్‌కు నిర్వహించారు. ఈ తరగతుల రెండో రోజు ఆదివారం అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) మాజీ నాయకులు శేషారత్నం, ప్రస్తుత ఐద్వా నేతలు సత్యవతి, కొండమ్మ, భారతి, లక్ష్మి, కుమారి, ఆలపించిన విప్లవ గేయాలు సభికులను ఉర్రూతలూగించాయి. 'ఓ పల్లెటూరి పేదరైతా పిల్లా జల్లా సల్లంగున్నారా.. నీ పిల్లజల్లా సల్లంగున్నారా', 'సుందరయ్య మీకు మా జోహార్లు అయ్యా, ఓసుందరయ్యా మీకు మా జోహార్లు అయ్యా' అంటూ శేషరత్నం పాడారు. ప్రజానాట్యమండలి కళాకారులు నాగేశ్వరరావు, స్టాలిన్, చంటి, మౌలాలి పలు గేయాలను ఆలపించారు.



బిఎన్ రోడ్డులో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

కొత్తకోటలో కుక్కల బెడద

-భయాందోళన చెందుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం మేజర్ పంచాయతీ కొత్తకోటలో వీధి కుక్కలు బెడద ఎక్కువైంది. గ్రామంలో ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఒంటరిగా నడిచి వెళ్లిన వ్యక్తులతో పాటు వాహనదారుల పై కూడా దాడులు చేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థిని, విద్యార్థులు, వృద్దులపై సైతం దాడులు చేసి గాయ పరచడంతో తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ కుక్కల బారినపడి ఇప్పటికే పలువురు గాయలపాలయ్యారు. రాత్రి సమయంలో బిఎన్ రోడ్డు మెయిన్ రోడ్డు పైనే గుంపు గుంపులుగా తిరుగుతూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికైనా స్థానిక పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం:కేరళ రాష్ట్రం వయనాడు వరద బాధితులకు విరాళాలు ఇచ్చి వారిని ఆదుకోవడానికి ముందుకు రావాలని సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము పిలుపునిచ్చారు. వయనాడు వరద బాధితుల సహాయార్థం సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం అచ్యుతాపురం, మోసయ్యపేట గ్రామాలలో విరాళాలు సేకరణ చేపట్టారు. 7000 రూపాయలు విరాళాలు వచ్చాయి. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, కాండ్రేగుల రామ సదాశివరావు, బుద్ధ రంగారావు, కె సోము నాయుడు, చౌడుపల్లి అప్పారావు, చేపల తాతయ్య, లాలం నరసింహారావు, ఆర్ లక్ష్మి, సిహెచ్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.



విశాఖలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

కె.కోటపాడు : మండలంలోని ఆనందపురం గ్రామంలో సిపిఎం నాయకులు కేరళ వయనాడు వరద బాధితుల సహాయార్థం ఆదివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు మాట్లాడుతూ వరదలకు నిరాశ్రయులైన బాధితులను ఆదుకోవడానికి విరివిగా విరాళాలు ఇవ్వాలని కోరారు. గ్రామంలో దుకాణాలు, ప్రజల వద్ద నుండి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి నాయినిబాబు, ఎర్రా దేవుడు, వనము సూర్యనారాయణ, పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.

నక్కపల్లి:కేరళలోని వరదల కారణంగా నిరాశ్రయులైన వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు కోరారు. నక్కపల్లిలో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం వ్యాపారులు, ప్రజల నుండి విరాళాల సేకరణ చేపట్టారు .నక్కపల్లిలో వసూళ్ళు చేసిన 4,830 రూపాయలు విరాళాలు కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపిస్తామన్నారు. సిపిఎం నాయకులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్, బి.రాము, వై.నవీన్, డి.కొండ, ఎం.అప్పలరాజు, జి.రాము, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.25 వేల నగదును అందజేసిన డాక్టర్ రమేష్

గాజువాక: కేరళ వరద బాధితులకు విశాఖ నగర పరిధిలోని గాజువాకకు చెందిన ఎంవిఆర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ రూ.25 వేల ఆర్థిక సాయాన్ని సిపిఎం నేతలకు అందజేశారు. ఆర్థికసాయం నగదును సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు, నాయకులు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, జగన్, గాజువాక జోన్ కార్యదర్శి, ఎం రాంబాబులకు అందజేశారు.



విరాళం అందిస్తున్న డాక్టర్ రమేష్

విశాఖ కలెక్టరేట్ : కేరళలో వరద బాధితుల సహాయార్థం సిపిఎం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యాన ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని చేపల మార్కెట్ వద్ద విరాళాలు సేకరించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో సహకరించారు. మొత్తం రూ.15,162 విరాళంగా అందించారు. ఈ మొత్తం పార్టీ నగర కమిటీకి పంపించినట్లు జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వై.రాజు, సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, డివైఎఫ్ఐ నాయకులు గణేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, శ్రీనివాస్, నారాయణ, మత్స్యకారుల నాయకులు వాసుపల్లి చంద్రమౌళి, సత్యనారాయణ పాల్గొన్నారు.